క్లుప్తంగా

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన



ప్రాజెక్టు పనితీరును వివరిస్తున్న విద్యార్థులు

విజయనగరం: నవరాత్సోవాల్లో భాగంగా విజయనగరం రోటరీ సెంట్రల్ క్లబ్ వారు జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. నగరంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు రూపొందించి, ప్రదర్శించిన సైన్స్ ప్రాజెక్టులు, వాటి పనితీరు చూపరులను అలరించాయి. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు విజయకుమార్ అగర్వాల్, రోటరీ సెంట్రల్ క్లబ్ కార్యదర్శి ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మద్యంసీసాలు స్వాధీనం



పట్టుబడిన మద్యంసీసాలు చూపిస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

భోగాపురం: మండల వ్యాప్తంగా నిర్వహిస్తున్న మద్యం బెల్టుషాపులపై ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులు శనివారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా రావాడ గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అరెస్ట్ చేసి, అతడి నుంచి 10 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ రవికుమార్ తెలిపారు. అలాగే బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతూ పట్టుబడిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. దాడులు చేసిన వారిలో ఎస్ఐ చంద్రమోహన్, హెచ్‌సీలు ప్రతాప్, రామారావు, కానిస్టేబుల్ మహేశ్వరరావు ఉన్నారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి



మాట్లాడుతున్న జిల్లా స్త్రీ,శిశు సంక్షేమ సాధికారిత అధికారిణి విమలారాణి

విజయనగరంఫోర్ట్: రక్షణ చట్టాల గురించి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండడం అవసరమని జిల్లా స్త్రీ,శిశు సంక్షేమ సాధికారిత అధికారిణి టి.విమలారాణి అన్నారు. శనివారం స్థానిక మహిళా ప్రాంగణంలో ఐసీడీఎస్ పీవోలు, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలకు వివిధ చట్టాలతో పాటు వన్‌స్టాప్ సెంటర్, జిల్లా బాలల సంరక్షణ విభాగం, సఖి నివాస్, శక్తి సదన్, ఉమెన్ హెల్ప్‌లైన్ నంబర్ 181, చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ 1098ల సేవలను వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీవో ప్రసన్న వన్‌స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ పి.సాయివిజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సబ్జెక్ట్‌పై పట్టు సాధించాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ శామ్యూల్ డేవిడ్

విజయనగరం అర్బన్: విద్యార్థులంతా తమకు ఇష్టమైన సబ్జెక్ట్‌పై పట్టు సాధిస్తే ఉపాధి, ఉద్యోగావకాశాలు అపారమని కడప జిల్లా పోరుమామిళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శామ్యూల్ డేవిడ్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జువాలజీ విభాగం ఆధ్వర్యంలో 'అన్ లాకింగ్ డోర్స్: కెరీర్ హరిజాన్ ఇన్ లైఫ్' అనే అంశంపై శనివారం నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై, ప్రసంగించారు. ముఖ్యంగా నూతన విద్యా విధానం ప్రకారం డిగ్రీలో జువాలజీ సబ్జెక్టు కలిగిన బీజెడ్‌సీ గ్రూపు విద్యార్థులు ఇంటర్న్‌షిప్‌లో హార్టీకల్చర్, హేచరీస్, నర్సరీలు వంటి అంశాలను ప్రాక్టికల్‌గా నేర్చుకుంటే ఆయా రంగాల్లో మంచి ఉపాధి, ఉద్యోగావకాశాలు దొరుకుతాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.రేఖ పాల్గొన్నారు.

ఒక బస్తాతో సరి..

గజపతినగరం: రైతులకు యూరియా అందించడంలో అధికారులు ఘోరంగా విఫలమయ్యారు. మండల కేంద్రంలోని శివశక్తి, మన గ్రోమోర్, తదితర దుకాణాల్లో యూరియా లేకపోవడంతో ఎక్కువ సంఖ్యలో రైతులు శనివారం స్థానిక సత్యసాయి ట్రేడర్స్ వద్దకు పరుగులు తీశారు. రైతుల తాకిడి ఎక్కువ కావడంతో వ్యవసాయాధికారి చీటీ రాసిస్తేనే యూరియా ఇస్తామని దుకాణదారులు చెప్పడంతో రైతులు మళ్లీ ఏఓ వద్దకు పరుగులు తీశారు. ఎంత భూమి ఉనా ఒక్క బస్తా ఇచ్చి సరిపెట్టు కోమంటున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అన్నదాతలకు సరిపడా యూరియా తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

కోలాహలంగా నిమజ్జనోత్సవం

వినాయక నిమజ్జనోత్సవం జిల్లా కేంద్రంలో శనివారం కోలాహలంగా జరిగింది. ఈ నెల 27న వినాయక చవితి పురస్కరించుకుని, మండపాల్లో కొలువుదీర్చిన గణనాథులకు విశేష పూజల అనంతరం సమీప చెరువులు, నదులకు తరలించి నిమజ్జనం చేశారు. ఈ క్రమంలో విగ్రహ ఊరేగింపులో డీజే పాటలకు యువతీ, యువకులు చేసిన డ్యాన్స్‌లు, పలువురు మహిళలు, చిన్నారులు చేసిన కోలాటం ఆకట్టుకున్నాయి. –సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం



అయ్యకోనేరు గట్టులో నిమజ్జనానికి తరలిస్తున్న గణనాథుడు



నిమజ్జనానికి తరలిస్తున్న బాలగణపతిని పట్టుకున్న శివుడి విగ్రహం



జొన్నగుడ్డిలో వినాయక విగ్రహ ఊరేగింపులో యువకుల డ్యాన్స్



విజయనగరం మెయిన్‌రోడ్డులో గణేశుని ఊరేగింపు

గృహ నిర్మాణ లక్ష్యాలు చేరుకోవాలి

- జిల్లా హౌసింగ్ స్పెషల్ ఆఫీసర్ పి.వెంకటరమణ

విజయనగరం అర్బన్: జిల్లాలో నిర్దేశించిన గృహ నిర్మాణ లక్ష్యాలను నిర్దేశిత సమయంలోగా చేరుకోవాలని జిల్లా హౌసింగ్ స్పెషల్ ఆఫీసర్ పి.వెంకటరమణ కోరారు. జిల్లా పర్యటనలో భాగంగా స్థానిక హౌసింగ్ కార్యాలయాన్ని శనివారం సందర్శించిన ఆయన.. ఇంజినీర్లు, ఇతర సిబ్బందితో సమావేశం నిర్వహించి, గృహ నిర్మాణాలపై సమీక్షించారు. అంతకుముందు వివిధ ప్రాంతాల్లోని ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి, పలు సూచనలు చేశారు. జిల్లాకు ప్రభుత్వం నిర్దేశించిన 11,648 గృహాల్లో ఇంతవరకు 5,988 మాత్రమే పూర్తయినట్లు నివేదికల ద్వారా తెలుస్తోందన్నారు. మిగిలిన 5,660 గృహాలు ఏయే దశల్లో ఉన్నాయని, వారంలోగా వాటి ప్రగతిలో మార్పు రావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా హౌసింగ్ పీడీ జి.మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.



గృహ నిర్మాణాలపై సమీక్షిస్తున్న జిల్లా హౌసింగ్ స్పెషల్ ఆఫీసర్ వెంకటరమణ

మా ఊరి చెరువును కాపాడండి



చెరువును సంరక్షించాలని నినాదాలు చేస్తున్న రైతులు

నెల్లిమర్ల: తమ గ్రామ చెరువును సంరక్షించాలని మండలంలోని తంగుడుబిల్లి గ్రామ రైతులు మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయం ఎదుట శనివారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ చిన్నఅప్పలనాయుడు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు నారాయణరావు, మాజీ సర్పంచ్ వెంకటరమణ మాట్లాడుతూ నెల్లిమర్ల–రణస్థలం ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న సర్వే నంబరు 72/1లో 2.4 ఎకరాల విస్తీర్ణం కలిగిన చెరువు ఉందని, ఆ చెరువు కింద కొంత ఆయకట్టు ఉందన్నారు. అలాగే పక్షులు, గోవుల తాగునీటికి కూడా ఆ చెరువే ఆధారమని అటువంటి చెరువును జిరాయితీగా చూపించి, కాజేసేందుకు కొంతమంది ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. తప్పుడు పత్రాలు సృష్టించి, ఆ చెరువును జిరాయితీ భూమిగా మార్చేందుకు చూస్తున్నారన్నారు. అడ్డగించిన రైతులపై కేసులు పెట్టి, భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. ఈ విషయంలో సంబంధం లేని ఉద్యోగులను కేసుల్లో ఇరికించాలని కూడా చూస్తున్నారన్నారు. 2020లో కూడా ఇదే చెరువును ఇదే విధంగా చదును చేసేందుకు ప్రయత్నించగా అడ్డుకున్నామని గుర్తుచేశారు. ఆ చెరువు గ్రామస్తుల ఉమ్మడి ఆస్తి అని, దాన్ని పరిరక్షించే బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉందన్నారు. అనంతరం తహసీల్దారును కలిసి ఇవే విషయాలను తెలియజేశారు.

వితరణ



క్రీడాకారులకు బ్యాట్‌లు అందజేస్తున్న దృశ్యం

విజయనగరం: నగరంలోని డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్ శిక్షణ పొందుతున్న క్రీడాకారులు జశ్విత, జోషికృష్ణలకు విజయనగరం సిటీ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంకేబీ శ్రీను వితరణ చేసిన షటిల్‌బ్యాట్‌లను శనివారం జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు కొండపల్లి అప్పలనాయుడు చేతులమీదుగా అందజేశారు. ఒక్కో బ్యాట్ రూ.5 వేలకు కొనుగోలు చేయడం జరిగిందని, క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న శ్రీనుకు కృతజ్ఞతలని క్రీడాకారులు తెలిపారు. అందివచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మంచి క్రీడాకారులుగా ఎదగాలని అప్పలనాయుడు ఆకాంక్షించారు. కార్యక్రమంలో విజయనగరం సిటీ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రసాద్, శ్రీనివాసరావు, భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నవ్యసమాజానికి మార్గదర్శి గురువు



ఉపాధ్యాయ దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

విజయనగరం: నవ్యసమాజానికి మార్గదర్శి, దిక్సూచి గురువు అని, అలాంటి గురువులను మనం గౌరవించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని విజయనగరం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కాపుగంటి శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు అతిథి గృహంలో శనివారం నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవంలో ఉపాధ్యాయ రంగంలో విశేష సేవలందిస్తున్న 30 మందిని సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అజ్ఞానమనే అంధకారం నుంచి విజ్ఞానమనే వెలుగును పంచేవాడే ఉపాధ్యాయుడని, ప్రతిఒక్కరూ తమ గురువులను గౌరవించి సన్మానించుకోవాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సముద్రాల గురుప్రసాద్, గిరిజా ప్రసన్న, సంఘ వ్యవస్థాపకుడు వెత్సా సత్యనారాయణమూర్తి, అధ్యక్షుడు తవ్వా మోహనరావు, కార్యదర్శి బోండా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులంతా లక్ష్య సాధనకు కృషి చేయాలి



నియామకపత్రాలు అందుకున్న విద్యార్థులతో మాజీ మంత్రి శ్రీనివాసరావు తదితరులు

భోగాపురం: విద్యార్థులంతా జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోవాలన్న లక్ష్యం ఏర్పరుచుకుని, దాని సాధనకు కృషి చేయాలని అవంతి విద్యాసంస్థల చైర్మన్, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, విజయనగరం జేఎన్‌టీయూ కళాశాల వైస్ చాన్సలర్ డి.రాజ్యలక్ష్మి కోరారు. మండలంలోని చెరుకుపల్లి దగ్గరున్న అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో అభినందన సభ శనివారం ఏర్పాటు చేసి, వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను సిబ్బంది అభినందించారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా విచ్చేసి కాసేపు మాట్లాడారు. ప్రతిఒక్కరూ లక్ష్యం ఏర్పరుచుకోవాలని, లక్ష్య సాధనలో వచ్చే అవరోధాలను ధైర్యంగా ఎదుర్కొంటే విజయం సొంతమవుతుందని స్ఫూర్తి నింపారు. మన కళాశాల విద్యార్థులు క్యాంపస్ ఇంటర్వ్యూల్లో పెద్దపెద్ద కంపెనీల్లో ఉద్యోగాలు సాధిస్తుండడం అభినందనీయమన్నారు. మిగతా విద్యార్థులు కూడా విజయం సాధించిన విద్యార్థులను ఆదర్శంగా తీసుకుని, జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

శివరాం రోడ్డులో ప్రయాణ అవస్థలు



శివరాం రోడ్డులో ఏర్పడిన గుంతలు

చీపురుపల్లి: పట్టణంలోని శివరాం రోడ్డు పూర్తిగా గోతులమయమైంది. ప్రయాణానికి ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయంటూ వాహనచోదకులు గగ్గోలుపెడుతున్నారు. చీపురుపల్లి పట్టణం నుంచి శివరాం, విజయరాంపురం, రెడ్డిపేట, అర్తమూరు, కోనూరు, బొప్పడాం తదితర గ్రామాలకు వెళ్లేందుకు ఈ రోడ్డే ఆధారం. ఫార్మా పరిశ్రమలకు వెళ్లే ఉద్యోగులు కూడా ఇదే రహదారిలో వెళ్లి వస్తుంటారు. వర్షాలు కురిసే సమయంలో గోతుల్లో నీరుచేరడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. స్థానిక పాలకులు స్పందించి రోడ్డు మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు.

నత్తే నయం

- బిల్లులు చెల్లించకపోవడంతో నిలిచిపోయిన సమావేశ భవన నిర్మాణం



పనులు నిలిచిపోయిన మెరకముడిదాం ఎంపీడీఓ సమావేశ భవనం

మెరకముడిదాం: మెరకముడిదాం ఎంపీడీఓ కార్యాలయం పక్కన నిర్మిస్తున్న సమావేశ భవనం నిర్మాణం కొద్ది రోజులుగా నిలిచిపోయింది. భవనం కోసం ప్రభుత్వం ఉపాహామీ పథకం నుంచి రూ.80 లక్షలు కేటాయించింది. పిల్లర్లు, శ్లాబ్ వరకు పనులు పూర్తయ్యాయి. ప్రభుత్వం సుమారు రూ.10 లక్షలు మేర బిల్లులు పెండింగ్ పెట్టడంతో సంబంధిత కాంట్రాక్టర్ పనులు నిలిపివేశారు. 2024 డిసెంబర్‌లో ప్రారంభించిన భవన నిర్మాణం ఇప్పటివరకు 50 శాతం కూడా పూర్తికాకపోవడం, ఇప్పుడు పనులు నిలిచిపోవడంతో సమావేశాలకు వసతి సదుపాయం ఇప్పట్లో కలిగే అవకాశం లేదని మండల వాసులు వాపోతున్నారు. నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేయాలని కోరుతున్నారు. ఇదే విషయాన్ని పీఆర్ ఏఈ హరికృష్ణ వద్ద ప్రస్తావించగా బిల్లులు పెండింగ్ వల్ల పనులు నిలిచిపోయిన మాట వాస్తవమేనని, నిధులు విడుదలైన వెంటనే పనులు తిరిగి ప్రారంభిస్తామని చెప్పారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లిమర్ల: స్థానిక సీకేఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కామర్స్ గెస్ట్ లెక్చరర్‌గా పనిచేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మజ్జి సత్యనారాయణ ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. అభ్యర్థులు కామర్స్‌లో 50 శాతం మార్కులతో పీజీ ఉత్తీర్ణత కలిగి ఉండాలని, ఈ నెల 9వ తేదీలోగా కళాశాలలో దరఖాస్తులు అందజేయాలన్నారు. అభ్యర్థులకు 11న ఇంటర్వ్యూ ఉంటుందని, దరఖాస్తు ఫారంతో పాటు, పదోతరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, పీజీ ధ్రువపత్రాల జిరాక్స్ కాపీలను అందివ్వాలని, మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 9490107015ను సంప్రదించాలని కోరారు.

దళితులకు కూటమి దగా

నెల్లిమర్ల రూరల్: దళితులను కూటమి ప్రభుత్వం దగా చేసిందని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి రేగాన శ్రీనివాసరావు ఓ ప్రకటనలో శనివారం విమర్శించారు. ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు కావస్తున్నా దళితులకు ఏ రకమైన మేలు చేయలేదన్నారు. కనీసం సబ్సిడీ రుణాలు కూడా అందించలేదన్నారు. దళితులపై దాడులు తప్ప మరేం చేయలేదన్నారు. తక్షణమే దళిత వర్గానికి ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు.

త్వరితగతిన పైపులైన్ మరమ్మతులు చేపట్టాలి



పైపులైన్ మరమ్మతుకు గురైన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న నగరపంచాయతీ చైర్‌పర్సన్ సరోజిని

నెల్లిమర్ల: త్వరితగతిన తాగునీటి పైపులైన్ మరమ్మతులు చేపట్టి, తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని నగరపంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని కోరారు. స్థానిక పట్టణంలోని అగురు వీధి వద్ద ఉన్న పంప్‌హౌస్‌లో మరమ్మతులకు గురైన పైపులైన్‌ను ఆమె..కమిషనర్ జయరాంతో కలిసి శనివారం పరిశీలించారు. పైపులైన్ పాడైన కారణంగా గత ఐదు రోజులుగా 5, 6, 10 వార్డుల్లోని అగురు, జంగాల, సువ్వాని, యాత వీధులతో పాటు నాయుడు కాలనీకి తాగునీటి సరఫరా నిలిచిపోయిందన్న విషయం తెలుసుకున్నారు. త్వరగా బాగు చేసి వారికి నీరు అందించాలని సూచించారు.

రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి సర్వే



రైల్వేలైన్ పనుల మ్యాప్‌ను పరిశీలిస్తున్న అధికారులు

విజయనగరం: నగరంలో మూడు రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి శనివారం సర్వే చేపట్టారు. నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య, ఇతర అధికారులు, ఈస్ట్‌కోస్ట్ డీఆర్‌ఎం కార్యాలయం డిప్యూటీ సీఈ, ఈఈలంతా ఈ సర్వేలో పాల్గొన్నారు. వేణుగోపాలపురం డైట్ కళాశాల వద్ద ఒకటి, గాజులరేగ రాళ్లమాలపల్లి ఎఫ్‌సీఐ గొడౌన్ వద్ద మరొకటి, వీటీఅగ్రహారం మార్కెట్ యార్డు వద్ద ఇంకొకటి నిర్మించేందుకు రైల్వే శాఖ సిద్ధమవుతున్నట్లు కమిషనర్ తెలిపారు. ఈ మేరకు కౌన్సిల్ అనుమతి కోరనున్నామన్నారు. 30 మీటర్ల వెడల్పు, కిలోమీటరు పొడవునా కుడి, ఎడమల వైపు సర్వీసు రోడ్డు నిర్మించనున్నారని, ఈ నిర్మాణాలు పూర్తయితే ప్రజలకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. సర్వేలో ఈఈ ప్రసాద్, టౌన్ సర్వేయరు సింహాచలం, రైల్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.

టోల్‌ప్లాజా ప్రారంభం

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం వద్ద జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన టోల్‌ప్లాజాను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్లాజా సిబ్బంది నవీన్ మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనల మేరకే ఫీజు వసూలు చేసి, వాహనాలను త్వరితగతిన పంపిస్తామన్నారు. అలాగే వాహనదారులతో పూర్తిస్థాయిలో సహాయసహకారాలు అందిస్తామని చెప్పారు.

కోటకు కొత్తరూపు

- జోరుగా ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలు తొలగిస్తున్న అధికారులు

శృంగవరపుకోట: 'కోట'కు ఎట్టకేలకు కొత్త రూపు రాబోతోంది. పట్టణంలోని ప్రధాన రహదారికి పట్టిన ఆక్రమణల గ్రహణం వీడనుంది. అరుకు – విశాఖ ప్రధాన రహదారిపై ఎస్.కోటలో ఆక్రమణలు పెరిగిపోవడంతో రోడ్డు తన వాస్తవ రూపు కోల్పోయింది. ఆక్రమణలు తొలగించాలని ప్రజలు ఎంతోకాలంగా కోరుతున్నా.. మీడియాలో కథనాలు వస్తున్నా ఏ ఒక్కరూ పట్టించుకోలేదు. ఎట్టకేలకు తహసీల్దార్ శ్రీనివాసరావు చొరవ తీసుకుని ఆక్రమణల తొలగింపు పనులు చేపట్టారు. ఇప్పటికే ఒకవైపు ఆక్రమణలు తీయించగా, శనివారం తెల్లవారుజామున మరోవైపు జేసీబీతో ఆక్రమణలు తొలగింపు పనులు చేపట్టారు. రెవెన్యూ, పోలీస్, పంచాయతీ ఉద్యోగుల ఆధ్వర్యంలో తొలగింపు పనులుజరిగాయి. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అవగాహన తప్పనిసరి



మాట్లాడుతున్న మెజిస్ట్రేట్ కనకలక్ష్మి

శృంగవరపుకోట: బాలికలకు గుడ్, బ్యాడ్ టచ్‌పై కచ్చితంగా అవగాహన కల్పించాలని స్థానిక మున్సిఫ్ కోర్టు మెజిస్ట్రేట్ బి.కనకలక్ష్మి తెలిపారు. శనివారం స్థానిక సెయింట్ జోసఫ్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుతం బాలికలపై లైంగిక వేధింపులు ఎక్కువయ్యాయని.. వారిని ఎదుటి వ్యక్తులు ఏ ఉద్దేశంతో చూస్తున్నారో.. ఎలా టచ్ చేస్తున్నారో తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సదస్సు అనంతరం ఆమె ఉపాధ్యాయులతో సమావేశమై విద్యార్థినులతో తరచూ ఉపాధ్యాయినులు మాట్లాడుతూ వారికి అవగాహన పెంచి, వారి సమస్యలు అడిగి తెలుసుకోవాలన్నారు. వారి మానసిక పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రత్న, న్యాయవాది అల్లు సత్యాజీ, తదితరులు పాల్గొన్నారు.